సాక్షి నిజామాబాద్


సోమవారం । 17 । మార్చి । 2025



మసీదుల అభివృద్ధిని..

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం మసీదుల అభివృద్ధిని పట్టించుకోవడంలేదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు.

- 8లో ▸



గరిష్టం/కనిష్టం
39.1 /19.4

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి.
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది.
పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.
ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సెలవురోజూ పన్ను వసూళ్లు



నిజామాబాద్ సిటీ : మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పన్ను వసూళ్లను వేగిరం చేశారు. సెలవురోజుల్లోనూ విధులు నిర్వర్తిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్‌తోపాటు డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ జయకుమార్, మున్సిపల్ ఈఈ మురళీమోహన్‌రెడ్డి సైతం సెలవుదినాలు, ఆదివారాల్లో విధులకు హాజరవుతున్నారు. ఉదయం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు పన్ను వసూళ్లలో నిమగ్నమవుతున్నారు. మున్సిపల్ అధికారులు ఆదివారం రూ.20 లక్షల పన్ను వసూలు చేశారు. వీరితోపాటు టీపీఆర్వో చిదుర రమేశ్ ఆధ్వర్యంలోని మెప్మా సీవోలు, ఆర్పీలు సైతం ఇంటి పన్ను వసూళ్లు చేపడుతున్నారు. ఆదివారం 500 ఇళ్లను పరిశీలించిన మెప్మా సిబ్బంది, ఇప్పటి వరకు రూ.13 లక్షల పన్ను వసూలు చేశారు.

వలకు చిక్కిన మొసలి



బాల్కొండ : చేపలు పట్టేందుకు జాలర్లు వేసిన వలకు మొసలి చిక్కిన ఘటన మెండోరా మండలం వెల్కటూర్ గ్రామ శివారులోని ఎల్లమ్మ చెరువులో ఆదివారం చోటు చేసుకుంది. కాకతీయ కాలువ పక్కనే ఉండడంతో మొసలి చెరువులోకి వచ్చి ఉంటుందని జాలర్లు భావిస్తున్నారు. వలకు చిక్కిన మొసలిని ఒడ్డుకు చేర్చి ఫారెస్ట్ అధికారులకు అప్పగించారు. చెరువుల్లో మొసళ్లు కనిపి స్తుండడంతో చేపలు వేటాడేందుకు జాలర్లు జంకుతున్నారు.

పొజిషన్ ఉన్నా.. పొమ్మంటున్నారు



వాగుగడ్డ ప్రాంతంలో పేదలు వేసుకున్న గుడిసెలు

- 2005లో 82 మందికి పొజిషన్ సర్టిఫికెట్లు జారీ
- ప్రస్తుతం ఖాళీ చేయాలని గూపన్‌పల్లి వాగుగడ్డ వాసులకు నోటీసులు
- మాయమాటలు చెప్పి సంతకాలు తీసుకున్నారని బాధితుల ఆరోపణ



అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ను కలిసి గోడు వెల్లబోసుకుంటున్న గూపన్‌పల్లి వాగుగడ్డ పేదలు

నిజామాబాద్‌నాగారం : తమకు నీడ దొరికిందనే సంతోషం వారికి మూణ్నాళ్ళ ముచ్చటే అయ్యే పరిస్థితి వచ్చింది. దొరికిన పని చేసుకుని పొట్టనింపుకునే పేద కుటుంబాలు గూపన్‌పల్లి పూలాంగ్ వాగు ప్రాంతంలో గుడిసెలు వేసుకుని 30 ఏళ్లుగా జీవిస్తున్నాయి. 2005లో అప్పటి ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల సూచనల మేరకు ఒక్కో కుటుంబానికి 60గజాల చొప్పున కేటాయిస్తూ సుమారు 82 కుటుంబాలకు పొజిషన్ సర్టిఫికెట్లు జారీ చేశారు. అయితే పొజిషన్ సర్టిఫికెట్లు ఉన్నా వారికి మున్సిపాలిటీ నుంచి ఇళ్ల నంబర్లు ఇవ్వలేదు. దీంతో విద్యుత్ మీటర్లు రాకపోవడంతో చీకట్లోనే ఉంటున్నారు. ఇటీవల సర్వే అంటూ రెవెన్యూ, మున్సిపల్ అధికారులు హడావుడిగా వారి వద్దకు వెళ్లి సంక్షేమ పథకాలంటూ పేపర్లపై సంతకాలు తీసుకుని వెళ్లారు. ఆ తరువాత వారం రోజుల్లో ఖాళీ చేయాలని ఈనెల 11వ తేదీన నోటీసులు జారీ చేశారు. తమకు పొజిషన్ సర్టిఫికెట్లు ఉన్నాయని గుడిసె వాసులు చెప్పినా.. మీకేమైనా సమస్య ఉంటే మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌ను కలవాలని సలహాఇచ్చి వెళ్లిపోవడం గమనార్హం. దీంతో చేసేది లేక కన్నీరుమున్నీరవుతూ ఈనెల 15వ తేదీన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు వద్దకు వెళ్లి తమ గోడువెల్లబోసుకున్నారు. అధికారుల చర్యతో కంటిమీద కునుకు కరువైన గుడిసెవాసులు ఆదివారం పొద్దున్నే అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ వద్దకు వెళ్లి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

కనీస సౌకర్యాలు లేకున్నా 30ఏళ్లుగా అక్కడే..

కనీస సౌకర్యాలు లేకున్నా గూపన్‌పల్లి వాగుగడ్డ ప్రాంతంలో గుడిసెలు, రేకుల షెడ్లు వేసుకున్న పేదలు 30 ఏళ్లుగా అక్కడే ఉంటున్నారు. ప్రభుత్వం పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చినా ఇంటి నంబర్లు మున్సిపాలిటీ జారీ చేయకపోవడంతో విద్యుత్, మంచినీటి సౌకర్యం ఇప్పటికీ లేదు. అంతా కలిసి ఓ చేతిపంపు వేయించి తాగునీటి సౌకర్యం కల్పించుకున్నారు.

పెద్దల కన్ను పడిందా..?

ఆగమేఘాల మీద గుడిసెవాసులను ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేయడం వెనుక పెద్దలున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. వాగుగడ్డ ప్రాంతంలోని గుడిసెలను ఆనుకుని ప్రైవేట్ వ్యక్తులకు 10 ఎకరాల భూమి ఉండగా, దానికి రోడ్డు సౌకర్యం లేదు. గుడిసెలను ఖాళీ చేయిస్తే ఆ భూమిలోకి వెళ్లేందుకు 50 ఫీట్ల రోడ్డును వేసుకొవచ్చనే ఉద్దేశంతో ఈ కుట్రకు తెరలేపారని స్థానికులు అంటున్నారు. ప్రైవేట్ వ్యక్తులకు చెందిన భూమి గూపన్‌పల్లి కమాన్‌కు అతి సమీపంలో ఉండడంతో గుడిసెవాసులను ఖాళీ చేయించి రోడ్డు వేయాలని ప్లాన్ వేశారని ఆరోపిస్తున్నారు. తమను ఖాళీ చేయించేందుకు రాజకీయ పార్టీల నాయకులు సైతం అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని గుడిసెవాసులు కన్నీరు పెట్టుకుంటున్నారు.

రోడ్డు వేసుకోవాలని చూస్తున్నారు



మా గుడిసెల ముందు ఉన్న భూమికి రోడ్డు వేసేందుకు మమ్మల్ని ఖాళీ చేయించాలని చూస్తున్నారు. మేం 30 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాం. గూపన్‌పల్లి, గంగస్థాన్‌లోని పెద్దపెద్ద ఇళ్లలో పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నాం. మేము ఖాళీ చేసే ప్రసక్తే లేదు. అవసరమైతే మా ప్రాణాలు తీసుకోండి.

– లింగని పోశవ్వ, స్థానికురాలు

సాంగ్లీలో షుగర్ ఫ్యాక్టరీ చైర్మన్ గణపతిరావుతో మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి తదితరులు



చెరుకు సాగు, క్రషింగ్‌పై అధ్యయనం

- మహారాష్ట్రలో షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ కమిటీ స్టడీ టూర్
- రెండురోజులపాటు సాగిన పర్యటన
- మొదటి రోజు అధికారులు, రెండో రోజు సభ్యులు..
- పాల్గొన్న మంత్రి, కమిటీ చైర్మన్ శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బోధన్: షుగర్ ఫ్యాక్టరీల నిర్వహణ, అధిక దిగుబడులు అందించే చెరుకు సాగు పద్ధతుల అధ్యయనం కోసం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ కమిటీతోపాటు అధికారుల బృందం మహారాష్ట్రలో రెండురోజులు పర్యటించింది. మహారాష్ట్రలోని కోల్హాపూర్ జిల్లా సాంగ్లీ నగర కేంద్రంలోని శ్రీదత్తా కో – ఆపరేటీవ్ షుగర్ ఫ్యాక్టరీని అధికారులు శనివారం, కమిటీ చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతోపాటు సభ్యులు, రైతులు ఆదివారం సందర్శించారు. ఫ్యాక్టరీ చైర్మన్ గణపతిరావు పాటిల్‌తో సమావేశమై ఫ్యాక్టరీ నిర్వహణ విధానం, అధిక దిగుబడులు అందించే వంగడాలు, రికవరీ, రోజువారీ క్రషింగ్ తదితర అంశాలను తెలుసుకున్నారు. అనంతరం చెరుకు తోటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధిక దిగుబడులు సాధించేందుకు సాగులో పాటించాల్సిన పద్ధతులను రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రత్యేక కమిటీ సభ్యుడు, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, రాష్ట్ర పరిశ్రమల ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్, పరిశ్రమల డైరెక్టర్ మన్నూస్, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, రాష్ట్ర, జిల్లా స్థాయి వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఉద్యానవన, పరిశ్రమలు, షుగర్ కేన్ శాఖల అధికారులు, బోధన్ ప్రాంత రైతులు పాల్గొన్నారు.

సమాజ పరివర్తనకు సంఘ్ కృషి

- ధర్మరక్షణ కోసం శక్తిమంతులుగా తయారవ్వాలి
- దక్షిణ మధ్య క్షేత్ర ధర్మజాగరణ ప్రముఖ్ అమర లింగన్న
- ఇందూరు నగరశాఖ ఆధ్వర్యంలో 56 శాఖల సమ్మేళనం



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న అమర లింగన్న

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : కుటుంబ వ్యవస్థ పటిష్టంగా ఉంటేనే హిందూ సమాజానికి శ్రేయస్సు అని, సమాజ పరివర్తనే స్వయం సేవక్‌ల బాధ్యత అని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ దక్షిణ మధ్య క్షేత్ర ధర్మజాగరణ ప్రముఖ్ అమర లింగన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో ఆదివారం ఇందూరు నగర శాఖ ఆధ్వర్యంలో 56 శాఖల సంగమం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రధాన వక్తగా లింగన్న హాజరై ప్రసంగించారు. కుటుంబ వ్యవస్థ మనచేతిలోనే ఉందని, కుటుంబం నుంచే భావి పౌరులకు జీవన విలువలు తెలపాలని అన్నారు. హిందూ సమాజాన్ని, సనాతన ధర్మాన్ని కాపాడేందుకు ఉద్భవించిన కలియుగ ప్రత్యేక అవతారం ఆర్‌ఎస్‌ఎస్ అన్నారు. ధర్మాన్ని కాపాడుకోవాలంటే శక్తిమంతంగా తయారు కావాలని, హిందువులందరూ సంఘటితంగా ఉంటేనే శక్తి సముపార్జన సాధ్యమవుతుందని పేర్కొన్నారు. భారతదేశంలో బ్రిటిష్ వాడు సృష్టించిన హిందువుల్లోని ఓ వర్గం విభజనవాదం చేస్తోందని విమర్శించారు. కమ్యూనిస్టులు చీడపురుగుల్లా తయారయ్యారని, అన్నిమతాలు సమానమని చెబుతూనే మతమార్పిడులను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. హిందువులను మైనారిటీలుగా చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయన్నారు. గిరిజనులు, బంజారాలు, లింగాయత్‌లలో తాము హిందువులం కాదనే భావనను సృష్టిస్తున్నారన్నారు. ఇలాంటి కుట్రలకు ఫండింగ్ చేస్తున్న దొంగలెవరో ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు.

బానిసత్వంలోకి నెట్టారు..

మహాపురుషులకు కొదువ లేని భారతదేశం కొందరి స్వార్థం, కుట్రల కారణంగా ఆత్మన్యూనత, అనైక్యతలకులోనై బానిసత్వంలోకి నెట్టబడిందని అమర లింగన్న ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేప థ్యంలో డాక్టర్ హెడ్గేవార్ భారత్‌ను మళ్లీ గురుస్థానంలోకి తీసుకొచ్చేందుకు స్వాతంత్రోద్యమం చేస్తూనే ఆర్‌ఎస్‌ఎస్‌ను స్థాపించారన్నారు. హిందువుల్లో సమైక్యత నిర్మాణం కోసం కృషి చేశారని, ప్రతిరోజూ హిందువులు కలిసేలా సఫలపూరిత కార్యపద్ధతి నెలకొల్పారన్నారు. సమయపాలన, ఆజ్ఞాపాలన విషయమై పుస్తకాలు రాయలేదని, హెడ్గేవార్ ఆచరించి చూపారని పేర్కొన్నారు.

కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ నగర కార్యవాహ అర్గుల సత్యం, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారితోపాటు స్వయం సేవక్‌లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ప్రార్థన చేస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు

విద్యార్థులకు కార్పొరేట్ గాలం

మొదలైన అడ్మిషన్ల దందా

- నిబంధనలకు విరుద్ధంగా ప్రక్రియ
- రాజధానితోపాటు జిల్లాకు చెందిన ప్రైవేటు కళాశాలల పోటీ
- ప్రభుత్వ, ప్రైవేటు హెచ్‌ఎంలకు విందులు
- ఆఫర్లు ప్రకటిస్తున్న పీఆర్వోలు
- అయోమయంలో తల్లిదండ్రులు

మా విద్యాసంస్థలో మెరుగైన వసతులున్నాయి. మీ పిల్లలను మంచి ర్యాంకులు సాధించేలా తీర్చిదిద్దుతాం. ముందుగా అడ్మిషన్ తీసుకుంటే ఫీజులో డిస్కౌంట్ ఇప్పిస్తాం. రిజల్ట్ తర్వాత వస్తే సీట్లు అయిపోతాయ్. ఫీజులు పెరుగుతాయి.

- విద్యార్థి తల్లిదండ్రులతో ఓ కార్పొరేట్ విద్యాసంస్థ పీఆర్వో మాటలివి.



నిజామాబాద్‌అర్బన్: పదో తరగతి పరీక్షలు ముగియకముందే కార్పొరేట్ 'దందా' మొదలైంది. 'మీ పిల్లలను మా కళాశాలలో చేర్పించండి' అంటూ తల్లిదండ్రులకు గాలం వేస్తున్నాయి. విద్యార్థులు చదివే పాఠశాలలకు వెళ్లి మరీ ప్రచారం చేస్తున్నాయి. హైదరాబాద్‌కు చెందిన బడా కార్పొరేట్ విద్యాసంస్థలతోపాటు జిల్లాకు చెందిన ప్రైవేటు కళాశాలలు సైతం ఈ తతంగాన్ని కొనసాగిస్తున్నాయి. ప్రత్యేకంగా పీఆర్వోలను నియమించుకుని నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్ల ప్రక్రియను చేపడుతున్నాయి.

తిష్టవేసిన పీఆర్వోలు

కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలకు చెందిన పీఆ ర్వోలు రెండు నెలల క్రితం నుంచే జిల్లాలో తిష్ట వే శారు. లాడ్జీల్లో ఉంటూ పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థుల పాఠశాలలకు వెళ్తూ తల్లిదండ్రుల ఫోన్ నంబర్లను తీసుకుంటున్నారు. అనంతరం మెసేజ్ లు, వాయిస్ కాల్స్ చేయడంతోపాటు వాట్సాప్ ద్వారా ప్రచార పోస్టర్లను పంపుతూ అడ్మిషన్లు తీసుకునేలా మభ్యపెడుతున్నారు. జిల్లా కేంద్రంలోని కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థలు కూడా అడ్మిషన్ల కోసం ఇదే తంతు అవలంబిస్తున్నాయి. పరీక్షలు ప్రారంభం కాకముందే ఫోన్‌కాల్స్, ప్రచారంతో విసిగిస్తుండడంతో ఇటు తల్లిదండ్రులు, అటు విద్యార్థులు అయోమయంలో పడుతున్నారు.

విందులు, ఆఫర్లు

కార్పొరేట్ పీఆర్వోలు ప్రతిరోజు ప్రైవేట్ విద్యాసంస్థలతోపాటు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలను కలుస్తూ వారికి విందులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసింది. తమ కళాశాలకు అడ్మిషన్లు ఇప్పించాలంటూ ఆఫర్లు ప్రకటిస్తున్నారు. చదువులో మెరుగ్గా ఉన్న విద్యార్థుల వివరాలను ముందే తీసుకొని హెచ్‌ఎంల ద్వారా తల్లిదండ్రులను కలుస్తున్నారు. ఇటీవల రెండు ప్రధాన ఉపాధ్యాయ సంఘాలకు హైదరాబాద్‌కు చెందిన ఓ కార్పొరేట్ విద్యా సంస్థ జిల్లా కేంద్రంతోపాటు రాజధానిలో రెండుసార్లు పెద్ద ఎత్తున విందు ఏర్పాటు చేసినట్లు సమాచారం.

నిబంధనలకు విరుద్ధంగా..

పరీక్షలు పూర్తయి, ఫలితాలు వెలువడిన తర్వాతే అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కావాలి. నిబంధనల ప్రకారం మే, జూన్ నెలల్లో కళాశాలల్లో చేరికలు మొదలు పెట్టాల్సి ఉంటుంది. కానీ, అవేమీ పట్టించుకోని కార్పొరేట్ విద్యాసంస్థలు జనవరి నుంచే అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించాయి. ఇదంతా నిబంధనలకు విరుద్ధమంటూ విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలు అడ్మిషన్ల పర్వం మొదలుపెట్టినట్లు తెలిసినా సంబంధిత విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చర్యలు తీసుకుంటాం



నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు చేపట్టొద్దు. ప్రైవేటు కళాశాలల్లో ముందస్తుగా అడ్మిషన్లు చేపడుతున్న దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటాం. అనుమతి లేని కళాశాలలపై తప్పకుండా చర్యలు ఉంటాయి.

– రవికుమార్, జిల్లా ఇంటర్ విద్యాధికారి

రహదారిలో రంగురంగుల పూలు



జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ బైపాస్ రోడ్డు మీదుగా కలెక్టరేట్, ఐటీ హబ్ వైపు వెళ్లేవారికి రంగురంగుల పూలు ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. రోడ్డు మధ్య డివైడర్లలో పూల మొక్కలు ఆకట్టుకుంటున్నాయి. ఇదే రోడ్డు మీదుగా బాసర, భైంసా, బోధన్ వైపు ప్రయాణించే వాహనదారులు డివైడర్ మధ్యలోని ఖర్జూర చెట్లు.. వాటి కిందే రంగురంగుల పూలమొక్కలను చూస్తూ మంత్రముగ్ధులవుతున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్





బైపాస్ రోడ్డు డివైడర్ల మధ్య రంగురంగుల పూలమొక్కలు

జగదీశ్‌రెడ్డి క్షమాపణలు చెపాల్సిందే




దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

నిజామాబాద్ సిటీ: అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి క్షమాపణలు చెప్పాల్సిందేనని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద కేటీఆర్, జగదీశ్‌రెడ్డిల దిష్టిబొమ్మలను కాంగ్రెస్ నేతలు ఆదివారం దహనం చేశారు. ఈ సందర్భంగా మానాల మాట్లాడుతూ.. పదేళ్లుగా బీఆర్‌ఎస్ నాయకులు బీసీలను, గిరిజనులు, దళితులను అవమానిస్తూనే ఉన్నారన్నారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన జగదీశ్‌రెడ్డి, సమర్థించిన కేటీఆర్‌కు తగిన గుణపాఠం చెబుతామన్నారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్, నుడా చైర్మన్ కేశ వేణు, జిల్లా గ్రంథాలయ చై ర్మన్ అంతరెడ్డి రాజారెడ్డి, నాయకులు రత్నాకర్, రాంభూపాల్, గోపి, వేణురాజ్, నరేందర్‌గౌడ్, కెతావత్ యాదగిరి, వినయ్, లవంగ ప్రమోద్, అయూబ్, పోల ఉష, విజయలక్ష్మి, అపర్ణ, జగడం సుమన్, అంతరెడ్డి విజయ్‌పాల్ పాల్గొన్నారు.

మురిపించి మరిచారు!

- కొత్త రేషన్ కార్డుల కోసం తప్పని నిరీక్షణ
- గణతంత్ర దినోత్సవం రోజున ఎంపిక చేసిన గ్రామాల్లో పంపిణీ
- మిగతా గ్రామాల్లో దరఖాస్తుదారుల ఎదురుచూపులు
- ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసినా ముందుకు సాగని ప్రక్రియ



మోర్తాడ్(బాల్కొండ): గణతంత్ర దినోత్సవాన ఎంపిక చేసిన గ్రామాల్లో రేషన్ కార్డులు పంపిణీ చేసి మురిపించారని, తరువాత ఆ ఊసే ఎత్తడం లేదని దరఖాస్తుదారులు అంటున్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జనవరి 26న జిల్లాలోని 31 గ్రామాల్లో 1066 కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశారు. అప్పటికే కొత్త కార్డుల కోసం జిల్లా వ్యాప్తంగా 81,148 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ లెక్కన 80వేల మందికి పైగా దరఖాస్తుదారులు తమకు కార్డు ఎప్పుడొస్తుందనే ఎదురుచూస్తూనే ఉన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో కొత్తకార్డుల పంపిణీకి బ్రేక్‌పడిందని కొన్నాళ్లపాటు చెప్పుకొచ్చినప్పటికీ.. ప్రస్తుతం కార్డులు అందజేసేందుకు ఏం అడ్డంకి ఉందని దరఖాస్తుదారులు ప్రశ్నిస్తున్నారు. ఏ సంక్షేమ పథకానికైనా ప్రభుత్వం రేషన్ కార్డునే ప్రామాణికం చేయడంతో నూతన కార్డులు జారీ చేయాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది.

మార్పులు, చేర్పులపై కనిపించని స్పందన

రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పుల కోసం గత ఎనిమిదేళ్ల కాలంలో పలుమార్లు పౌర సరఫరాలశాఖ దరఖాస్తులు స్వీకరించినా ఎలాంటి ప్రయోజనం లేదు. కొత్తగా పెళ్లి చేసుకుని అత్తవారింటికి వచ్చిన వారి పేర్లను స్థానికంగా కార్డుల్లో చేర్చాల్సి ఉంది. అలాగే పిల్లల పేర్లనూ చేర్చాల్సి ఉంది. ఇప్పటికే పలుమార్లు దరఖాస్తు చేసుకున్న వారు కార్డుల్లో పేర్లు నమోదుకాకపోవడంతో నిరాశకు గురవుతున్నారు. కొత్త కార్డుల జారీ లో జాప్యం, మార్పులు చేర్పుల అంశంపై 'సాక్షి' పౌర సరఫరాల శాఖ అధికారులను ఫోన్‌లో సంప్రదించగా తమకు ఎలాంటి సమాచారం లేదని వెల్లడించారు. ప్రభుత్వం నుంచి స్పష్టత వచ్చే వరకు తాము ఏమీ చెప్పలేమని సమాధానం ఇచ్చారు.

నిర్లక్ష్యం తగదు



కొత్త కార్డుల జారీని ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదు. ఎంతో మంది కార్డులు వస్తాయని ఆశతో ఉన్నారు. గత పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం కార్డులు జారీ చేయకుండా నిర్లక్ష్యం చేసింది. ఇప్పుడు కూడా అదే విధానం కొనసాగించడం సరికాదు.

– పెద్దరాజారెడ్డి, మాజీ సర్పంచ్, గుమ్మిర్యాల్

హామీని నిలబెట్టుకోవాలి



కొత్తగా రేషన్ కార్డులను జారీ చేస్తామని ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. ఎన్నికలకు ముందు ఒకలా ఆ తరువాత మరోలా కార్డుల జారీపై మాట మార్చడం సరికాదు. నూతన కార్డులు జారీ చేయడంతో పాటు మార్పులు, చేర్పులు చే యాలి.

– తోకల నర్సయ్య, మాజీ సర్పంచ్, తాళ్లరాంపూర్

క్లుప్తంగా

నేడు ఇసుక డంపుల వేలం

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని మర్పల్లి గ్రామంలో సీజ్ చేసిన ఇసుక డంపులకు సోమవారం వేలంపాట నిర్వహించనున్నట్లు తహసీల్దార్ భిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి సంబంధించిన వ్యక్తులు వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు.

ప్రమాదకరంగా ప్రయాణం



రాంగ్‌రూట్‌లో వస్తున్న లారీ

బాల్కొండ: మెండోరా మండలం బుస్సాపూర్ వద్దగల జాతీయ రహదారి 44పై ఆదివారం ఓ లారీ రాంగ్‌రూట్‌లో వస్తుండటంతో 'సాక్షి' క్లిక్ మనిపించింది. గతంలో అనేక మార్లు ఈ చోటనే రోడ్డు ప్రమాదాలు సంభవించాయి. అయినా రాంగ్‌రూట్‌లో వాహనాలు వస్తున్న హైవే అధికారులు, పోలీసులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రాంగ్‌రూట్‌లో వాహనాలు రాకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

అలీసాగర్‌లో మడ్‌బాత్



మట్టి స్నానం చేస్తున్న యోగా సాధకులు

ఎడపల్లి(బోధన్): మండలంలోని అలీసాగర్ రిజర్వాయర్ వద్ద ఆదివారం యోగా గురువు ప్రభాకర్ ఆధ్వర్యంలో మడ్‌బాత్ (మట్టిస్నానం) నిర్వహించారు. నవీపేట, నందిపేట, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, ఎడపల్లి, మోస్రా, బాన్సువాడ యోగా కేంద్రాల నుంచి సుమారు 400 మంది యోగా సాధకులు ఈ మడ్‌బాత్‌లో పాల్గొన్నారు. యోగా రత్న ప్రభాకర్ మాట్లాడుతూ.. మడ్‌బాత్ ఆరోగ్యానికి మంచిదన్నారు. అనంతరం యజ్ఞం నిర్వహించారు.

ప్రత్యేక బస్సులతో ఆర్టీసీకి ఆదాయం

ఆర్మూర్ టౌన్: ఆర్మూర్ డిపో నుంచి ఇటీవల నడిపిన ప్రత్యేక బస్సుల ద్వారా భారీగా ఆదాయం సమకూరింది. ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి జాతరను పురస్కరించుకుని ఆర్టీసీ ప్రత్యేక బస్సులను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఆర్మూర్ డిపో నుంచి ఈ నెల 12నుంచి 15వరకు ప్రత్యేక బస్సులు నడిపినట్లు డిపో మేనేజర్ రవికుమార్ తెలిపారు. మొత్తం 20 బస్సులు రోజుకు రెండు ట్రిప్పుల చొప్పున నడిచాయి. దీంతో సుమారు రూ. 25లక్షల ఆదాయం సమకూరింది. అలాగే ఇటీవలే మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా వేములవాడకు 78 ప్రత్యేక బస్సులను నడిపించామని, అందులో ఆర్టీసీకి రూ. 20లక్షల ఆదాయం సమకూరిందన్నారు.

'ఒకే దేశం-ఒకే ఎన్నిక' చరిత్రాత్మక నిర్ణయం



సమావేశంలో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్: దేశ అభివృద్ధి కోసం ప్రధాని నరేంద్ర మోదీ చేపడుతున్న సంస్కరణల్లో మరో చరిత్రాత్మక నిర్ణయం 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' అని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం 'వన్ నేషన్-వన్ ఎలక్షన్' వర్క్‌షాప్ ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ధన్‌పాల్ మాట్లాడుతూ.. ప్రతిసారి ఎన్నికల కోసం రూ.వేల కోట్ల ప్రజాధనం ఖర్చవుతుందన్నారు. తరచూ జరిగే ఎన్నికల వల్ల అభివృద్ధి పనులకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. 'వన్ నేషన్-వన్ ఎలక్షన్' ద్వారా ప్రజాధనం ఆదా అవడంతోపాటు అభివృద్ధి పనులు వేగంగా అమలు చేయవచ్చన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ఒకేసారి జరగడం వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం మెరుగుపడుతుందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, జిల్లా ఉపాధ్యక్షుడు నాగోళ్ల లక్ష్మీనారాయణ, నాయకులు కంచెట్టి గంగాధర్, నక్క రాజేశ్వర్, లక్ష్మీనారాయణ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందిపై నిఘా పెట్టేదెవరు?

- నిజామాబాద్ బల్దియాలో ఎంహెచ్‌వో పోస్టు ఖాళీ
- రెండేళ్లుగా భర్తీ చేయని అధికారులు
- నియంత్రణ లేక ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది



బల్దియా కార్యాలయం

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అతి కీలకమైన మున్సిపల్ హెల్త్ ఆఫీసర్(ఎంహెచ్‌వో) పోస్టు రెండేళ్లుగా ఖాళీగా ఉంది. దీంతో కిందిస్థాయి సిబ్బంది ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో నగరంలో పారిశుధ్య పనులు, తనిఖీలు సరిగా చేపట్టకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఇదీ పరిస్థితి..

నగరంలోని ఐదు జోన్లకు గాను ఐదుగురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లున్నారు.వీరిపై శానిటరీ సూపర్‌వైజర్, ఆయనపై ఎంహెచ్‌వో పర్యవేక్షణ ఉండాలి. కానీ పారిశుధ్య పనులు కేవలం శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మాత్రమే చూస్తున్నారు. కానీ పైఅధికారి లేకపోవడంతో వారు విధుల్లో తీవ్ర అలసత్వం వహిస్తున్నారు. నగరంలో ప్రతిరోజు 300 మెట్రిక్ టన్నుల చెత్త తయారవుతోంది. ఈ చెత్తను ఇంటింటి నుంచి సేకరించడం, మున్సిపల్ వాహనాల్లో తరలించడం, కూడళ్లలో వేసిన చెత్తను తొలగించడం వంటి నిత్య ప్రక్రియలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. డ్రైనేజీలు చెత్త, మురికినీటితో నిండిపోయాయి. అలాగే రెగ్యులర్ ఉద్యోగులు రాకున్నా వారికి హాజరువేసి వారి వద్దనుంచి నెలనెలా వసూళ్లకు పాల్పడుతున్నారు. అయినా వీరిపై అధికారులు నిఘా ఉంచడం లేదు.

తనిఖీలు కరువు..

నగరంలో 200 వరకు ఫుట్‌పాత్‌ల మీదనే హోటళ్లు, దుకాణాలు నిర్వహిస్తున్నారు. నాణ్యతలేని సరుకులు వాడటంతోపాటు అపరిశుభ్రంగా ఉన్న స్థలాల్లో తినుబండారాలు విక్రయించడంతో నగరవాసులు అనారోగ్యం పాలవుతున్నారు. అయినా వీరిపై ఎలాంటి తనిఖీలు లేవు. టిఫిన్‌సెంటర్ల వద్ద ప్రతీనెల సిబ్బంది మాముళ్లు వసూలు చేసినా పట్టించుకునే వారు లేరు. పాలిథిన్ బ్యాగ్‌లపై నిషేధం ఉన్నా కిరాణదుకాణాలు, టిఫిన్‌సెంటర్లు, కూరగాయలు, పండ్ల వర్తకుల వద్ద తనిఖీలు చేయడం లేదు. కొందరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ట్రేడ్ లైసెన్స్‌లు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేస్తున్నారు. ఎంహెచ్‌వో పోస్టు భర్తీ చేస్తే బల్దియా సిబ్బందిపై నిఘా ఉంచి, అందరూ సక్రమంగా విధుల నిర్వహించేలా చర్యలు చేపట్టే అవకాశం ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బల్దియాలో ఎంహెచ్‌వో పోస్టును భర్తీ చేయాలని పలువురు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



మా ఇంటిముందు డ్రెయినేజీలు నిండిపోయి మురికినీరు రోడ్డుమీద పారుతోంది. మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పనులు చేయడం లేదు. నగరంలో పారిశుధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. ఉన్నతాధికారులు సంబంధిత అధికారిని నియమిస్తే సమస్యలను పరిష్కరించే అవకాశం ఉంది. -శ్రీనివాస్, జవహర్ రోడ్డు వాసి

త్వరలో నియమిస్తాం



బల్దియాలో చాలా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎంహెచ్‌వో పోస్టు కూడా ఖాళీగా ఉంది. సీడీఎంఏకు తెలియజేశాం. డిప్యూటీ కమిషనర్ అదనపు బాధ్యతలు చూస్తున్నారు. ప్రతిరోజు ఉదయం నేను తనిఖీలు నిర్వహిస్తున్న. నిర్లక్ష్యంగా ఉన్న సిబ్బందిని హెచ్చరిస్తున్నా.

-దిలీప్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

28ఏళ్లకు కలుసుకున్న మిత్రులు





దేవునిపల్లిలో సమావేశమైన జెడ్పీహెచ్‌ఎస్ 1997-98 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు.. పడకల్ జెడ్పీహెచ్‌ఎస్ 1999-2000 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

కామారెడ్డి రూరల్: చిన్నతనంలో కలిసి చదువుకున్న మిత్రులు 28ఏళ్ల తర్వాత కలుసుకున్న అపూర్వ ఘట్టం మండలంలోని దేవునిపల్లిలో చోటుచేసుకుంది. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997–98 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఏళ్ల తర్వాత కలుసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఆనాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం వారంతా సహపంక్తి భోజనాలు చేశారు.

పడకల్‌లో 25ఏళ్ల తర్వాత..

జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1999–2000 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు స్థానిక మున్నూరుకాపు సంఘ భవనంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. విద్యార్థులు ఒకరినొకరు కలుసుకొని చిన్ననాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అలాగే అదే పాఠశాలకు చెందిన 2011–12 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు బడిలోనే ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆనాటి ఉపాధ్యాయులు గోపాలకృష్ణ, స్వామి, జెడ్పి సింధూర, ప్రసాద్, మమతలను పూర్వ విద్యార్థులు సత్కరించారు.

కల్లెడిలో 13ఏళ్ల తర్వాత..

మాక్లూర్: మండలంలోని కల్లెడి ప్రభుత్వ పాఠశాలలో 2011–12 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 13ఏళ్ల తర్వాత వారంత మళ్లీ కలుసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. చదువు చెప్పిన ఆనాటి గురువులను వారు సన్మానించారు.



కల్లెడి జెడ్పీహెచ్‌ఎస్ 2011-12 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు



పడకల్ జెడ్పీహెచ్‌ఎస్ 2011-12 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

క్రైం కార్నర్

బైక్, కంటెయినర్‌ను ఢీకొన్న కారు

- ఒకరి మృతి, నలుగురికి గాయాలు



కంటెయినర్‌ను ఢీకొన్న కారు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని 44వ నెంబర్ జాతీయ రహదారిపై ఓ కారు అతివేగంగా వచ్చి బైక్, కంటెయినర్‌ను ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా నలుగురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ఇషాద్, కర్ణల్ ఉపాధి నిమిత్తం భీమ్‌గల్‌కు వచ్చారు. తమ స్నేహితులు ఆర్మూర్ నుంచి యూపీకి వెళుతుండగా కలవాలనుకున్నారు. దీంతో శనివారం రాత్రి ఇద్దరు కలిసి బైక్‌పై బయలుదేరగా, మార్గమధ్యలో పెర్కిట్‌లో ఉన్న మరో స్నేహితుడు మనీష్‌ను ఎక్కించుకుని వెళ్లారు. ఆర్మూర్‌లోని హైవే పైగల మహిళా ప్రాంగణం వద్ద వీరి బైక్‌ను ఓ కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. అనంతరం ఆగిఉన్న కంటెయినర్‌ను ఢీకొట్టింది. ఈఘటనలో ఇషాద్ అక్కడికక్కడే మృతి చెందగా బైక్‌పై ఉన్న మరో ఇద్దరు కర్ణల్, మనీష్, కారులోని రాహుల్, గణేష్‌లు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. మృతదేహాన్ని, క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.మృతుడి బావ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యానారాయణగౌడ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మాచారెడ్డి: మండలకేంద్రంలోని మాచారెడ్డి–కామారెడ్డి రహదారిపై గల పెట్రోల్ బంక్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. మాచారెడ్డి మండల కేంద్రానికి చెందిన నర్సయ్య, నారాయణలు మాచారెడ్డి చౌరస్తా నుంచి టీవీఎస్ మోపెడ్‌పై వెళుతుండగా, పెట్రోల్ పంపు వద్ద వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో వారికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు స్పందించి వెంటనే వారిని చికిత్స నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు.

కోతుల దాడిలో ఒకరికి ..

ఆర్మూర్ టౌన్: పెర్కిట్ ఆర్టీసీ కాలనీలో ఒడ్డాజీ జనార్ధన్ అనే వ్యక్తిపై ఆదివారం కోతులు దాడి చేయడంతో గాయపడ్డాడు.ఇంటి ముందు కూర్చున్న సమయంలో కోతులు దాడి చేయడంతో ఆయనకు గాయాలు అయ్యాయి. స్థానికులు గమనించి అతడిని చికిత్స నిమిత్తం ఆర్మూర్ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ మందులు లేకపోవడంతో ఆయనను జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



మృతదేహాన్ని బయటకు తీస్తున్న సిబ్బంది

బాన్సువాడ రూరల్: నిజాంసాగర్ ప్రధాన కాలువలో గల్లంతైన సంగ్రాం తండాకు చెందిన యువకుడు సిద్ధార్థ (19) మృతదేహం ఆదివారం లభ్యమైంది. బాన్సువాడ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. శనివారం సిద్ధార్థ, అన్న వరుసయ్యే రాజు ఇద్దరు కలిసి బైక్‌పై తండాకు వస్తుండగా మార్గమధ్యలో కాలువ వద్ద ఆగారు. రాజు కాలువలోకి దిగి కాళ్లుచేతులు కడుగుతుండగా నీటిలో పడిపోయాడు. రాజును రక్షించే క్రమంలో సిద్ధార్థ కాలువలో జారిపోగ స్థానికులు గమనించిన రాజును రక్షించారు. కానీ సిద్ధార్థ నీటిప్రవాహంలో కొట్టుకుపోయి మృతిచెందినట్లు తండాపెద్దలు సంగ్రాం నాయక్ తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

- గోదావరిలో దూకుతుండగా అడ్డుకున్న పోలీసులు



యువకుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

నవీపేట: ఓ యువకుడు ఆత్మహత్యకు యత్నించగా పోలీసులు అడ్డుకొని కాపాడారు. వివరాలు ఇలా.. జిల్లా కేంద్రంలోని శివాజీనగర్ కాలనీకి చెందిన బయ్యాని వంశీకృష్ణ(30) వడ్రంగి పని చేస్తూ జీవించేవాడు. ఇటీవల ఇంట్లో కుటుంబ సభ్యులతో జరిగిన ఘర్షణతో అతడు తీవ్ర మనస్తాపం చెందాడు. ఆదివారం గోదావరి నదిలో దూకి చనిపోతానని కుటుంబ సభ్యులను బెదిరించి ఇంట్లోను వెళ్లిపోయాడు. ఈ విషయాన్ని వారు నవీపేట పోలీసులకు తెలిపారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు మండలంలోని యంచ శివారులోగల గోదావరి బ్రిడ్జిపై నడుచుకుంటూ నదిలో దూకేందుకు యత్నించిన యువకుడిని అడ్డుకున్నారు. కౌన్సెలింగ్ చేసి అతడిని తల్లిదండ్రులకు అప్పగించారు.

మక్కల ట్రాక్టర్ బోల్తా



బాల్కొండ: ముప్కాల్ మండలం వేంపల్లి గ్రామానికి చెందిన రైతు అమ్మక్కపేట్ కిషన్ మక్కల లోడ్‌తో ట్రాక్టర్‌ను చేనులో నుంచి కల్లాం వద్దకు తీసుకొస్తుండగా మార్గమధ్యలో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో రైతుకు ఎలాంటి గాయాలు కాలేదు. కానీ మక్కలు వరి పొలంలో పడటంతో నీటిపాలయ్యాయి. పొక్లెయిన్ సహాయంతో ట్రాక్టర్‌ను పంట పొలాల నుంచి బయటకు తీశారు.

ఇసుక టిప్పర్, పొక్లెయిన్ సీజ్



ఆర్మూర్‌టౌన్: ఆలూర్ మండలం దేగాం గ్రామ శివారులోని వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ ఆదివారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించగా పొక్లెయిన్‌తోపాటు టిప్పర్‌ను సీజ్ చేశామన్నారు. అలాగే ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు.

దివ్యాంగులకు ప్రభుత్వం చేయూత

- నేడు జిల్లాకేంద్రంలో సహాయ పరికరాల పంపిణీ
- సమగ్రశిక్ష సహిత విద్యావిభాగం ఆధ్వర్యంలో శిబిరం నిర్వహణ

ఆర్మూర్/నిజామాబాద్ అర్బన్: జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రత్యేక అవసరాలు గల పిల్లల(దివ్యాంగులకు)కు చేయూతను అందించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సోమవారం జిల్లాకేంద్రంలో సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో దివ్యాంగులకు సహాయ పరికరాలను అందించడానికి ఏర్పాట్లు చేసింది. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశాల మేరకు డీఈవో అశోక్, సహిత విద్యా విభాగం జిల్లా కోఆర్డినేటర్ పడకంటి శ్రీనివాస్‌రావు పర్యవేక్షణలో ఆర్టిఫిషియల్ లింబ్స్ మానిఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (అలిమ్‌కో) సహకారంతో ఈ శిబిరాన్ని నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు.

275మంది లబ్ధిదారులు..

జిల్లా కేంద్రంలోని న్యూ హౌజింగ్‌బోర్డు కాలనీలో గల ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దివ్యాంగులకు సహాయ పరికరాల పంపిణీ శిబిరాన్ని నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 2,057 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఉండగా, సుమారు 600 మంది చిన్నారులకు వివిధ కేటగిరీల్లో పరికరాలు అవసరం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అలిమ్‌కో అధికారుల పరీక్షల అనంతరం వీరిలో 275 మంది దివ్యాంగులను లబ్ధిదారులుగా గుర్తించారు. ఎంపికైన లబ్ధిదారులు సంబంధిత సర్టిఫికెట్లు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు తీసుకొని శిబిరానికి హాజరు కావాల్సి ఉంటుంది. శిబిరంలో బ్రెయిలీ కిట్లు 17, హియరింగ్ ఎయిడ్స్ 44, వీల్ చైర్స్ 63, ఎమ్మార్ కిట్స్ 87, ట్రై సైకిల్స్ 8, రోలర్స్ 5, ఇతర పరికరాలు 51 పంపిణీ చేయనున్నారు. అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలి

అర్హులైన దివ్యాంగులు సహాయ పరికరాలను తీసుకొని సద్వినియోగం చేసుకోవాలి. వివిధ వైకల్యాలతో బాధపడుతున్న పిల్లలకు ఈ పరికరాలు ఎంతగానో ఉపయోగపడతాయి.

-అశోక్, డీఈవో, నిజామాబాద్

ఎంతో ఉపయోగకరం

అలిమ్‌కో ప్రతినిధులు దివ్యాంగులకు అవసరమైన పరికరాల కోసం పరీక్షలు నిర్వహించి అర్హులను గుర్తించారు. ఉచితంగా అందజేసే ఈ పరికరాలు దివ్యాంగులకు ఎంతో ఉపయోగకరం.

– పడకంటి శ్రీనివాస్ రావు, సహిత విద్యావిభాగం జిల్లా కోఆర్డినేటర్

మసీదుల అభివృద్ధిని విస్మరించిన కాంగ్రెస్

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- నగరంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు

నిజామాబాద్ అర్బన్: రంజాన్ సమయంలో ఒక్కో మసీదు సుందరీకరణకు బీఆర్ఎస్ హయాంలో రూ.లక్ష ఇచ్చామని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం మసీదుల అభివృద్ధిని పట్టించుకోవడంలేదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆమె హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మసీదులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని, ముస్లిముల వైపు ఏ పార్టీ నిలుస్తుందో తెలుస్తోందన్నారు. ముస్లిములకు ఇచ్చిన హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని, తక్షణమే హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, గణేశ్‌గుప్తా, జెడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, మాజీ మేయర్ నీతూ కిరణ్, బోధన్ నియోజకవర్గ నాయకురాలు ఆయేషా ఫాతిమా, రెడ్కో మాజీ చైర్మన్ అలీం, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

తండ్రిని హతమార్చిన తనయుడు

- సహకరించిన తల్లి
- డబ్బులు ఇవ్వడం లేదని ఘాతుకానికి పాల్పడ్డ నిందితులు



మల్లయ్య (ఫైల్)

ధర్పల్లి: తన అవసరాలకు డబ్బులు ఇవ్వడం లేదని కన్న తండ్రిని కొడుకు హతమార్చిన ఘటన ధర్పల్లి మండలంలో చోటుచేసుకుంది. తల్లి సైతం కొడుకుకు సహకరించడంతో పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ధర్పల్లి సీఐ భిక్షపతి, ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని హొన్నాజీపేట్ గ్రామానికి చెందిన పాలెం చిన్న మల్లయ్య (65)కు భార్య లక్ష్మి, కొడుకు మధు ఉన్నారు. మల్లయ్య తనకున్న భూమిలో వ్యవసాయం చేసుకుంటూ, ఆవుల కాపరిగా జీవనం కొనసాగిస్తున్నారు. కొడుకు వివాహం జరుగగా, పొలం పనులు చేసుకుంటు ఉండేవాడు. డబ్బుల విషయంలో మల్లయ్యతో లక్ష్మి, కొడుకు మధు తరచూ గొడవపడేవారు. శనివారం రాత్రి గ్రామంలో ని ఒక కిరాణా దుకాణం వద్ద తనకు డబ్బులు కావాలని కొడుకు, తండ్రితో గొడవకు దిగగా, స్థానికులు సర్దిచెప్పారు. కానీ కోపం పెంచుకున్న కొడుకు తండ్రిని చంపాలని నిర్ణయించుకొని, బీరు సీసాతో ఇంటికి వెళ్లాడు. గొడవ విషయాన్ని తల్లికి చెప్పడంతో ఇద్దరు కలిసి మల్లయ్యతో గొడవకు దిగారు. తల్లి, కొడుకు ఇద్దరు కలిసి మల్లయ్య గొంతు పట్టుకొని కిందకు పడేశారు. వెంటనే మధు, మల్లయ్యపై సీసాతో దాడి చేశారు ఈ క్రమంలో మల్లయ్య తలకు గాయమై, రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారాన్ని అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని నిందితులను ఆదివారం రిమాండ్ కు తరలించారు.

రెండు ఆలయాల్లో చోరీ



వర్ని: మండలంలోని జలాల్పూర్ గ్రామంలోగల మల్లికార్జునస్వామి, కృష్ణ దేవాలయంలో గుర్తు తెలియని వ్యక్తి శనివారం రాత్రి చోరీకి పాల్పడ్డాడు. ఆదివారం ఉదయం ఆలయానికి వచ్చిన భక్తులు చోరీని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దుండగుడు ఐదు తులాల బంగారం, 25 తులాల వెండి, హుండీలోని నగదును ఎత్తుకెళ్లాడు. సీసీ కెమెరా ఫుటేజీలో నిందితుడి దృశ్యం రికార్డయింది. గ్రామస్తులు వర్ని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్..

రుద్రూర్: కోటగిరి మండలం కొత్తపల్లి శివారులో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి గుర్తుతెలియని దుండగులు కాపర్ కాయిల్స్‌ను ఎత్తుకెళ్లారు. పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు కిందపడవేసి అందులోని కాపర్ కాయిల్స్ దొంగిలించారు. ఘటనపై విద్యుత్ అధికారులకు సమాచారం అందించినట్లు రైతులు ఆదివారం తెలిపారు.

పోతంగల్‌లో బైక్..

రుద్రూర్: పోతంగల్ మండల కేంద్రంలో బైక్‌ను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. వివరాలు ఇలా.. పోతంగల్‌లోని ఆబాది బీసీ కాలనీలోగల కిరాణ షాపు వద్ద రెండు రోజుల క్రితం ఇందూర్ గంగాధర్ తన బైక్‌ను నిలిపాడు. దుకాణంలోకి వెళ్లి వచ్చేసరికి దుండగులు బైక్‌ను చోరీ చేశారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు ఆదివారం తెలిపారు.

మహిళను నమ్మించి నగలు అపహరణ

నిజాంసాగర్(జుక్కల్): ఓ మహిళను గుర్తుతెలియని ఆటో డ్రైవర్ నమ్మించి నగలు ఎత్తుకు వెళ్లిన ఘటన మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. నిజాంసాగర్ ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాలు ఇలా.. సంగారెడ్డి జిల్లా మార్డి గ్రామానికి చెందిన మ్యాతరి భూమవ్వ శనివారం సాయంత్రం నిజాంసాగర్ బస్టాండ్‌కు వచ్చింది. అచ్చంపేట గ్రామంలోని కూతురి ఇంటికి వెళ్లడానికి బస్టాండ్ వద్ద రోడ్డుపై నిల్చుంది. అదే సమయంలో అచ్చంపేట వైపు వెళ్తున్న ఓ ఆటోలో మరో మహిళ ఉండగా భూమవ్వ సదరు ఆటో ఎక్కింది. అచ్చంపేట గ్రామం వైపు వెళ్లిన ఆటోను డ్రైవర్ మార్గమధ్యలో నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్లాడు. అనంతరం భూమవ్వ మెడలో ఉన్న రెండు తులాల బంగారు ఆభరణాలు, 20తులాల వెండి ఆభరణాలను ఎత్తుకువెళ్లాడు. భూమవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శివకుమార్ ఆదివారం తెలిపారు.

చెరువులో పడి ఒకరి మృతి

కామారెడ్డి క్రైం: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన కామారెడ్డి మండలం తిమ్మక్‌పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా.. లింగాయిపల్లి గ్రామానికి చెందిన దుమ్మల మల్లయ్య (50) శనివారం సాయంత్రం తన కులానికి చెందిన మహిళ చనిపోవడంతో అంత్యక్రియలకు కుటుంబంతో కలిసి తిమ్మక్‌పల్లికి వెళ్లారు. అంత్యక్రియలు పూర్తయ్యాక తిమ్మక్‌పల్లి చెరువులో అందరూ కలిసి స్నానాలకు దిగారు. ప్రమాదవశాత్తు మల్లయ్య నీట మునిగి చనిపోయాడు. స్థానికులు చాలాసేపు గాలించి మృతదేహాన్ని బయటకు తీశారు. సమాచారం అందుకున్న దేవునిపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి భార్య శివవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు ఆదివారం తెలిపారు.